వందనం.. నిబంధనం

తల్లికి వంచన..

- అనేక నిబంధనలతో అర్హులకు మొండిచెయ్యి
- సరైన కారణాలు చూపకుండానే అనర్హులుగా ప్రకటన
- ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఎగనామం
- రీసర్వే ఎల్‌పీ నంబర్‌తో పేదలకు తప్పని తిప్పలు
- కార్యాలయాల చుట్టూ పేదల ప్రదక్షిణలు



రాయదుర్గంలోని బాలగంగాధర తిలక్ ప్రభుత్వ పాఠశాల



రాయదుర్గం: సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి నేతలు ప్రతి ఇంటా ఎంతమంది చదువుకునే పిల్లలు ఉన్నా 'తల్లికి వందనం' అమలు చేసి, ప్రతి ఒక్కరికీ రూ.15వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఇదే ప్రధాన హామీగా ప్రకటించారు. 'నీకు రూ.15 వేలు .. నీకు రూ.15 వేలు' అంటూ .. గొప్పగా ప్రచారం చేశారు. ఏడాదిగా దీని ఊసే ఎత్తలేదు. తీరా అమలు చేయాల్సి వచ్చే సరికి అనేక ఆంక్షలు పెడుతున్నారు. పథకం అమలులో అనేక కొర్రీలు పెట్టారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తులు తీసుకొని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 777 ప్రభుత్వ ప్రథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గతేడాది 1,18,530 మంది విద్యార్థులు చదువుకున్నారు. ఈ ఏడాది కొత్త అడ్మిషన్లు తోడవుతున్నాయి. మరో 300 దాకా ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 20 వేల మంది దాకా విద్యార్థులు ఉంటారు. జూనియర్ కళాశాలలు సుమారు 15 వరకు ఉన్నాయి. వీటిలోనూ సుమారు 1800 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 40 శాతం మందికి పైగా వివిధ సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో మూడు నియోజకవర్గాల్లోని 87,538 మంది తల్లులకు రూ.113.79 కోట్లు ఎలాంటి ఆంక్షలు లేకుండా 'అమ్మఒడి' ద్వారా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు. ఇంటింటికీ వలంటీర్లు వచ్చి కావాల్సిన పత్రాలు సేకరించి, తీసుకెళ్లేవారు. అర్హులు కాలు బయటకు పెట్టనీకుండా పథకాలు ఇంటి గుమ్మం వద్దకే చేర్చారు. అమ్మఒడి ఒక్కటే కాకుండా ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీవిద్య, ఫీజురీయింబర్స్ మెంట్, జగన్న విద్యాకానుక, నాణ్యమైన మెనూ, నాడు-నేడు తో పాఠశాలల రూపురేఖలు మార్చారు. తాజాగా అలాంటి పరిస్థితులు కనిపించలేదు.

నిబంధనలు ఇలా..

- ఒకే ఇంట్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందితే ఆ ఇంట్లో ఇతరులకు తల్లికి వందనం డబ్బు ఇవ్వరు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఉపకార వేతనాలు పొందేవారికి ఈ పథకం వర్తించదు.
- కుటుంబం నెలవారీ ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు మించితే పథకం వర్తించదు.
- మగాణి మూడెకరాలు, మెట్ట పదెకాలు మించకూడదు.
- పట్టణాల్లో వెయ్యి చ. అడుగుల స్థలం ఉన్నా, నాలుగు చక్రాల సొంత వాహనం ఉన్నా పథకం వర్తించదు.
- ప్రతి కుటుంబానికీ ఏడాదికి విద్యుత్ వినియోగాన్ని పరిగణలోకి తీసుకొని నెలకు 300 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగించి ఉంటే పథకం వర్తించదు.
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్ పొందుతున్న వారికి పథకం వర్తించదు. ఈ ఆంక్షలతో వేలాది మంది తల్లికి వందనం పథకానికి దూరమవుతున్నారు.

రూ.39 వేలు జమకావాలి



నాకు ప్రకాష్, రాజేశ్వరి, కీర్తి ముగ్గురు పిల్లలు ఉన్నారు. స్థానికంగా ఉండే హైస్కూల్‌లో పదో తరగతి ఇద్దరు, తొమ్మిదోతరగతి ఒకరు చదువుతున్నారు. పేద కుటుంబానికి చెందినివాడిని. రెండెకరాలు మాత్రమే పొలం ఉంది. తల్లికి వందనం ద్వారా రూ.39 వేలు జమ అవుతుందని ఆశించా. తీరా చూస్తే పొలం పదెకరాలున్నట్టు ఆన్‌లైన్‌లో చూపుతోంది. సవరణ కోసం తిరుగుతున్నాం.

– వన్నూర్‌స్వామి, ఎర్రగుంట, కణేకల్లు మండలం

ప్రభుత్వమే ఆదుకోవాలి



నాకు కేవలం 1.44 ఎకరాలు మాత్రమే పొలం ఉంది. రీసర్వే సమయాన జాయింట్ ఎల్‌పీలో సబ్‌డివిజన్ కాక పదెకరాలున్నట్టు ఆన్‌లైన్‌లో చూపుతోంది. దీంతో తల్లికి వందనం పథకం రిజెక్ట్ అయినట్టు అధికారులు చెప్తున్నారు. మాలాంటి పేదలకు ప్రభుత్వం న్యాయం చేయాలి.

– నాగరాజు, ఎర్రగుంట, కణేకల్లు మండలం

ఆంక్షలు సరికాదు



నాకు 1.60 ఎకరాల భూమి ఉంది. రీసర్వే తప్పులతో 20 ఎకరాల భూమి ఉన్నట్లు చూపుతోంది. అధికారులు చేసిన పొరపాట్లకు మేము నష్టపోవాల్సి వస్తోంది. ఇద్దరు పిల్లలకు రూ.26 వేలు జమ కావాల్సి ఉంది. జాబితాలో పేర్లున్నా పొలం ఎక్కువ ఉన్నట్టు చూపుతోంది. ఆంక్షలతో ఇబ్బంది పెట్టడం సరైంది కాదు.

– రుద్రముని, ఎర్రగుంట, కణేకల్లు మండలం

ఐదేళ్లు 'అమ్మఒడి' అందింది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 'అమ్మఒడి' ఏటా అందింది. తాజాగా తల్లికి వందనం డబ్బు నా ఇద్దరు కుమారుల్లో ఒక్కరికీ జమ కాలేదు. నాకు 1.40 ఎకరాల భూమి మాత్రమే. రీ సర్వే సమయాన సబ్‌డివిజన్ల విభజన చేయక 10 ఎకరాలకు పైగా మెట్ట భూమి ఉన్నట్టు రికార్డుల్లో చూపుతోంది.

– గంగాధర, ఎర్రగుంట, కణేకల్లు మండలం

రెవెన్యూ సిబ్బంది మెరుగైన సేవలందించాలి


విశ్రాంత తహసీల్దార్‌ను సన్మానిస్తున్న దృశ్యం


తహసీల్దార్ సుమతిని సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది


మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు

కణేకల్లు: ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించి రెవెన్యూ సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం కణేకల్లు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం ఘనంగా జరిగింది. అనంతరం విశ్రాంత తహసీల్దార్ బాలకృష్ణను తహసీల్దార్, డీటీ విశ్వనాథ్, ఆర్‌ఎస్‌డీటీ విజయకుమార్ సన్మానించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందికి ప్రసంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో వీఆర్వో పవన్‌కుమార్, మాజీ వైస్ సర్పంచు ఆనంద్‌రాజ్, కణేకల్లు చెరువు సంఘం అధ్యక్షులు బీటీ రమేష్, అనిల్ చౌదరి పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే నిర్వహించారు. తహసీల్దార్ ఆర్.సుమతి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైనది అని అన్నారు. అనంతరం తహసీల్దార్ సుమతి , డీటీ శ్రీనాథ్‌రెడ్డిని రెవెన్యూ అసోసియేషన్ సభ్యుడు, ఆర్‌ఐ నాగిరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్వోలు లక్ష్మన్న, హనుమంతరావు, నాగరాజు, వేణుగోపాల్, మర్రిస్వామి,రామకృష్ణమరియు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రకరూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ప్రజలకు అందిస్తున్న సేవలు, భూ వ్యవహా రాలు, వివిధ ప్రయోజనాల కోసం అందించే ధ్రువీకరణ పత్రాలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రిటైర్డు వీఆర్వో తిమ్మప్పను సన్మానించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కేశవరెడ్డి, జేవీవీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమా ర్, ఏఎస్ఓ పర్వతప్ప, సీఓ ఇబ్రహీం, వీఆర్వోలు భరత్ కుమార్, మారెన్న, ఖలందర్, సురేంద్ర, ఛత్రేనాయక్, వన్నూరప్ప, జేఏ కీర్తి, వీఆర్ఏలు,రైతులు,ప్రజలు తదితరులు పాల్గొ న్నారు.

పారదర్శకంగా రెవెన్యూ సేవలు

బొమ్మనహాళ్: రెవెన్యూ సేవలు పారదర్శకంగా అందించడమే లక్ష్యమని తహసీల్దార్ మునివేలు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ మునివేలు ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వీఆర్వోలు, వీఆర్ఏలను సన్మానించారు. కార్యక్రమంలో సర్వేయర్ రవితేజ, ఆర్‌ఐ బాలకృష్ణ, వీఆర్వోలు సుజాత, శృతి, రామన్న, యుగేంధర్, కుళాయిస్వామి, రవి కిరణ్, సురేంద్ర, నాగరాజురావు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలను సద్వినియోగం చేసుకోండి

కూడేరు: రెవెన్యూ శాఖ ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కూడేరు తహసీల్దార్ కార్యాలయంలో 'రెవెన్యూ డే'ని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన ఆర్‌ఐలు రామసుబ్బారెడ్డి, అంజ్లకూరప్పను సన్మానించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అయేషా సిద్ధికీ, ఆర్‌ఐ విజయ భాస్కర్ రెడ్డి, వీఆర్వోలు, సర్వేయర్లు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, మండల ప్రత్యేకాధికారి విశ్వనాథరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీటీ మధుసూదన్, సీఎస్‌డీటీ గురుబ్రహ్మ, ఆర్‌ఐ నగేష్‌బాబు, విశ్రాంత ఉపాధ్యాయులు ఈశ్వరప్ప, నాగరాజు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుడి నిజాయితీ

రాయదుర్గంటౌన్: ఆటోలో మర్చిపోయిన ఐఫోన్‌ను బాధితుడికి అందజేసి మహబూబ్‌బాషా అనే ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. బళ్లారికి చెందిన మహబూబ్‌బాషా రాయదుర్గం రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం ఆటో ఎక్కాడు. అందులో తన ఐఫోన్‌ను మర్చిపోయి దిగేశాడు. తర్వాత గమనించిన ఆటో డ్రైవర్.. ఐఫోన్‌ను తీసుకొని స్థానిక స్టేషన్‌మాస్టర్ ఉమా మహేష్‌ను కలిసి అందజేయగా, యజమానిని పిలిపించి ఐఫోన్‌ను అందజేశారు. కార్యక్రమంలో జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కలుషిత నీటితో అతిసార

కూడేరు: కలుషిత నీరు, ఆహారంతోనే అతిసారతో బాధపడాల్సి వస్తుందని వైద్యాధికారిణి ఉషారాణి తెలిపారు. శుక్రవారం వైద్యాధికారులు కూడేరులో అతిసార్పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిణి ఉషారాణి మాట్లాడారు. అతిసార వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోయినా, వైరస్, బ్యాక్టీరియా ద్వారా కూడా వస్తుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సరోజమ్మ, సూపర్ వైజర్లు రవీంద్ర, యశోదమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు జయ, లోకేశ్వరి, చంద్రకళ పాల్గొన్నారు.

అతిసార వ్యాధి ప్రమాదకరం

బొమ్మనహాళ్: అతిసారం వ్యాధి ప్రమాదకరమని పీహెచ్‌సీ వైద్యాధికారిణీ శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో డయేరియా నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ అతిసారం నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఈశ్వరయ్య, సూపర్‌వైజర్ యుగేంధర్, రుక్మిణీ, ఏఎన్ఎంలు భాగ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం


బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డీవైఈఓ మల్లారెడ్డి, ఎంఈఓ-2 హరికృష్ణ

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న 16 మంది ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశాన్ని ప్రధానోపాధ్యాయులు ఆదిశేషయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు నాగభూషణం, రామిరెడ్డి, షాశావలి, శ్రీధర్‌రెడ్డి, గౌరిశంకర్, అనుప్రభ, శ్రీదేవి, పుష్పావతి, లక్ష్మీదేవి, శ్రీలత, సారమ్మ, ప్రియదర్శిని పాఠశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి, సీఆర్‌పీ అమరేష్, ఉపాధ్యాయులు సుధీర్ కుమార్, పవన్‌కుమార్, నాగరాజు, శ్రీదేవి, రషీదా, రాజేశ్వరి, నీలిమ, సునీత, హిమబిందు, శ్రీవల్లి, కృష్ణవేణి, చంద్రలలిత పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఏడుగురు ఉపాధ్యాయులను శుక్రవారం సన్మానించారు. హెచ్‌ఎం వెంకటప్రసాద్ అధ్యక్షతన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీవైఈఓ మల్లారెడ్డి , ఎంఈఓ-2 హరికృష్ణతో కలసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బదిలీ అయిన మహమ్మద్ రఫీ, పీడీ నర్రా రాజశేఖర్, హిమాం సాహెబ్, ఉమాశంకర్, రాజేశ్వరి, రేష్మ బాను, శంకర్‌రెడ్డిను సన్మానించారు. ఉపాధ్యాయులు యు.శ్రీనివాసులు, గోవిందరెడ్డి, నాగరాజు, విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.నాగరాజు, జూడో కోచ్ విఠల్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా జమాలుద్దీన్ ఖాద్రీ ఉరుసు

ఉరవకొండ: స్థానిక జామీయ మసీదు సమీపంలో వెలసిన హజరత్ సయ్యద్ షా జమాలుద్దీన్ ఖాద్రీ ఉరుసు మహోత్సవాలు శుక్రవారం జియారత్ వేడుకలతో ముగిశాయి. స్వామి వారి సమాధి వద్ద సయ్యద్ అజ్మతుల్లా హుసేనీ, సయ్యద్ తఖీబాబా, సయ్యద్ తాసీర్‌బాబాల ఆధ్వర్యంలో వందలాది మంది ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జమాలుద్దీన్ ఖాద్రీ దర్గాను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం మెహిఫిలే ఫెహెజానే అవలియా నాత్‌ఖానీ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన తాషీబ్‌బాషా ప్రసంగించారు.




అలంకరణలో హజరత్ జామాలుద్దీన్ ఖాద్రీ సమాధి, విద్యుత్ దీపాలతో ముస్తాబైన దర్గా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


బోరంపల్లిలో యోగాసనాలు చేస్తున్న ఆర్‌డీఓ వసంత్‌బాబు


ఉరవకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో యోగా సాధనపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: యోగాతో అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆర్డీఓ వసంత్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని బోరంపల్లిలో యోగాంధ్ర కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ యోగాతో మానసిక ఒత్తిడిని అధిగమించొచ్చన్నారు. శనివారం కళ్యాణదుర్గంలో నిర్వహించే ప్రపంచ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో యోగా మాస్టర్ నబీ రసూల్, సర్పంచ్ శోభారాణి, ఉప సర్పంచ్ మల్లికార్జున, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని శనివారం నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ హర్షలత కోరారు. శుక్రవారం ప్రభుత్వ ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పట్టణంలో ర్యాలీ చేశారు. శనివారం పట్టణంలో నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్ఎస్ అధ్యాపకులు శ్రీధర్, రవిశంకర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

యోగాను అలవాటు చేయడమే లక్ష్యం

బొమ్మనహాళ్: యోగాతో ప్రతి ఒక్కరికీ మెరుగైన జీవన విధానాన్ని అలవాటు చేయడమే 'యోగాంధ్ర' ప్రధాన లక్ష్యమని ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో హైస్కూల్ ఆవరణలో యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ దాస్, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యవంతమైన జీవితం

ఉరవకొండ: ఆరోగ్యవంతమైన జీవితానికి యోగా చక్కటి మార్గమని యోగా గురువు నాగమల్లి ఓబుళేసు అన్నారు. శుక్రవారం ఉరవకొండ ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలో యోగా సాధన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా సాధనలో వందలాది మంది విద్యార్థినులు యోగాసనాలు వేశారు.

క్లుప్తంగా

గిట్టుబాటు ధర కల్పించాలన్నదే ఎఫ్‌పీఓ లక్ష్యం


మాట్లాడుతున్న ఎస్‌ఏడీఎల్ కోఆర్డినేటర్ రుద్రయ్య

కూడేరు: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు కల్పించి ఆర్థికాభివృద్ధి చెందేలా చేయాలన్నదే రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం (ఎఫ్‌పీఓ) లక్ష్యమని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ సీఓఓ మురళి తెలిపారు. శుక్రవారం కూడేరులో రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం 9వ వార్షికోత్సవ వేడుకలను సంఘం అధ్యక్షురాలు రాధ అధ్యక్షతన ఘనంగా జరుపుకున్నారు. సీఓఓ మురళి, ఎస్‌ఏడీఎల్ కోఆర్డినేటర్ రుద్రయ్యలు హాజరయ్యారు. సంఘం అధ్యక్షురాలు రాధ మాట్లాడుతూ సంఘంలోని వాటాదారులకు ఏమేరకు లాభం వచ్చిందనే విషయంపై వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ మేనేజర్ ప్రతాప్, ఎంటీఎల్ శివమ్మ, 120 మంది వాటాదారులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కోర్సులో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. పేర్కొన్నారు. బీఈ, బీటెక్, ఏఎంఐఈ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఈ నెల 23న సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 25న కళాశాలలో ఉదయం 10 గంటలకు డెమో క్లాస్ ఉంటుందన్నారు.

పని గంటల పెంపు నిర్ణయం ఉపసంహరించుకోవాలి


మాట్లాతున్న సీపీఐ ఇన్‌చార్జ్ నాగార్జున

రాయదుర్గంటౌన్: పని గంటలను పెంచుతూ కూటమి ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు. పోరాటాలు, త్యాగాల ఫలితంగా 8 గంటల పని విధానాన్ని కార్మికులు సాధంచుకుంటే.. కూటమి ప్రభుత్వం పది గంటల పని విధానాన్ని నిర్ణయించడం కార్మికులను శ్రమదోపిడీకి గురి చేయడమేనన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కావలి కొట్రేష్, కోశాధికారి అంజనేయులు, ఏపీ రైతు సంఘం తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి, తేజ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

వజ్రకరూరు: మండలంలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ షెక్షావలి ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి


ఉరవకొండ ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

ఉరవకొండ: విచ్చలవిడిగా డొనేషన్లు వసూలు చేస్తున్న ప్రైవేట్‌పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్పకు వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు శుక్రవారం వినతిపత్రం అందించారు. నియోజకవర్గ అధ్యక్షులు సాకే పురుషోత్తం మాట్లాడుతూ పలు ప్రైవేట్ పాఠశాలల్లో టెక్నో, ఒలింపియాడ్ పేరుతో రూ.వేలు ఫీజుల రూపంలో దండుకుంటున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయించలేదన్నారు. విద్యార్థి విభాగం నాయకులు ఎరుకుల మహేంద్ర, షేక్ ఇర్ఫాన్, శివరాజ్ పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే మలేరియా కట్టడి

రాయదుర్గంటౌన్: పరిసరాల పరిశుభ్రత, జాగ్రత్తలు పాటిస్తే మలేరియాను కట్టడి చేయొచ్చని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు అజహర్‌ఖాన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఒకటో సచివాలయం పరిధిలోని స్థానిక గౌడ లేఅవుట్‌లో మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకుని కాలనీలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ లక్ష్మీనరసమ్మ, హెల్త్ అసిస్టెంట్‌లు ఎర్రిస్వామి, సూర్యనారాయణ, రవి, రాజు, సెక్రటరీలు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం మార్పునకు ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ వసంతబాబు

బెళుగుప్ప: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని పాత పీహెచ్‌సీ భవనంలోకి మార్చేందుకు ఏర్పాట్లను ఆర్‌డీఓ వసంతబాబు శుక్రవారం పరిశీలించారు. ఇటీవల నూతన పీహెచ్‌సీ భవనం ప్రారంభం కావడంతో పాత పీహెచ్‌సీలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లను తహసీల్దార్ అనిల్‌కుమార్‌తో కలసి ఆర్‌డీఓ పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ మధుసూదన్, సీఎస్‌డీటీ గురుబ్రహ్మ, ఆర్‌ఐ నగేష్‌బాబు, పీఆర్ జేఈ పరుశరాం తదితరులు పాల్గొన్నారు.

సమాజంపైనా అవగాహన అవసరం


ఎస్‌ఎఫ్‌ఐ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు సమాజంపైనా అవగాహన అవసరమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా మహాసభలను పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ మాట్లాడుతూ ప్రాథమి విద్యను కేంద్ర ప్రభుత్వం విచ్చిన్నం చేసే దిశగా విధానాలు ఉన్నట్లు చెప్పారు. పేద విద్యార్థులకు శాస్త్రీయ విద్యా విధానం దక్కాలని నిరంతరం పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వలి, అనిల్, గణేష్, కిరణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు బాధ్యతల స్వీకరణ

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా ఐదుగురు పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు తీసుకున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్‌డీ దాస్ శుక్రవారం తెలిపారు. ఏలంజి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా యల్లప్ప, గోనేహాళ్‌కు పవన్‌కుమార్, కొలగానహళ్లికి అశోక్‌కుమార్, గోవిందవాడకు బాబా ఫక్రుద్దీన్, కురువళ్లికి రాజేష్ నాయక్‌లు బాధ్యతలు స్వీకరించిన్నట్లు తెలిపారు. గోనేహాళ్ పంచాయతీ కార్యదర్శి వెంకటేశులు, హరేసముద్రం శాంతి, దర్గాహొన్నూరు వెంకటేష్ బదిలీపై వెళ్లిన్నట్లు తెలిపారు.

శ్రీధరఘట్ట పశువైద్యాధికారిగా మనోహర్‌రెడ్డి

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్ట పశువైద్యాధికారి మనోహర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో పశువైద్యాధికారిగా పనిచేసిన మృదుల రెండేళ్ల క్రితం బదిలీపై వెళ్లింది. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న పోస్టును ఉన్నతాధికారులు భర్తీ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి పశువైద్యాధికారి మనోహర్‌రెడ్డిని శ్రీధరఘట్ట పశువైద్య శాలకు బదిలీ చేశారు. శుక్రవారం మనోహర్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు అనుమానితులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే దారిలో గురువారం ఓ ఇంట్లో చోరీకి యత్నిస్తుండగా యజమాని అప్రమత్తమయ్యాడు. దీనిపై ఇంటి యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఇద్దరు అనుమానితులను విచారించగా, వారి నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో వారి నుంచి ద్విచక్రవాహనంలో ఇనుపరాడ్డును స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై సీఐను అడగ్గా నిందితులు మండలంలోని మల్లాపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరులని తెలిపారు.